
సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

గురువారం | 27 | జూలై | 2023



నిత్యాన్నదానానికి విరాళం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో బుధవారం నిత్యాన్నదానానికి గునిశెట్టి శ్రీనివాస్, పావని, కుటుంబ సభ్యులు(నరసాపురం) రూ.50,116 విరాళం అందజేశారు.



డెల్టాలకు నీరు విడుదల

ధవళేశ్వరం: బ్యారేజీ నుంచి బుధవారం తూర్పుడెల్టాకు 2,000 , మధ్యడెల్టాకు 1,000 , పశ్చిమడెల్టాకు 1,000 క్యూసెక్కుల నీటిని విడుదలచేశారు.

బంగారు భవితకే విలీనం

ప్రత్యేక అవసరాలు గల చిన్నారులు మిగిలిన విద్యార్థులతో కలిసి చదివేలా భవిత కేంద్రాలను సమీప పాఠశాలల్లో విలీనం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రత్యేక అవసరాలు గల (శారీరక, మానసిక దివ్యాంగులు) పిల్లలను సాధారణ విద్యార్థులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం భవిత కేంద్రాలను ఏర్పాటు చేసింది.

8లో

న్యూస్‌రీల్

ఇన్‌చార్జి మంత్రి జోగి రమేష్ రేపు రాక



అమలాపురం టౌన్: రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జోగి రమేష్ శుక్రవారం జిల్లాకు రానున్నారు. జిల్లాలో ఆయన పలు మండలాల్లో జరిగే అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారు. అమలాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలక వర్గ ప్రమాణ స్వీకారోత్సవ సభకు మంత్రి రమేష్ ముఖ్య అతిథిగా పాల్గొంటారు. అనంతరం అమలాపురం నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన కార్యక్రమాలకు హాజరవుతారు. అనంతరం జిల్లాకు చెందిన అధికార, అనధికారులతో వివిధ అంశాలపై చర్చిస్తారు.

వెంకన్న హుండీల రాబడి రూ.66.14 లక్షలు



హుండీలను లెక్కిస్తున్న భక్తులు, సిబ్బంది

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి హుండీలను బుధవారం లెక్కించగా రూ.66,14,313 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. 28 రోజులకు హుండీలను లెక్కించగా ప్రధాన హుండీల నుంచి రూ.50,22,067, అన్న ప్రసాదం హుండీల నుంచి రూ.15,92,246 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. విదేశీ కరెన్సీ కూడా వచ్చిందన్నారు. బంగారం 26 గ్రాములు, వెండి 585 గ్రాములు వచ్చినట్లు వివరించారు. ఆలయ క్షేత్రపాలకుడు శ్రీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయ హుండీలను 28రోజులకు లెక్కించగా రూ.1,53,994 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, పలివెల ఉమాకొప్పేశ్వర స్వామి ఆలయ ఈఓ ఎస్‌వీఎస్ఎస్‌వీ ప్రసాదరాజు, పొడగట్లపల్లి ఉప్పలపాటి జానాకీయమ్మ అన్నదానసత్రం ఈఓ మీసాల రాధాకృష్ణ పర్యవేక్షణలో హుండీలను లెక్కించారు.

వరద బాధితులకు రెడ్ క్రాస్ చేయూత



రిలీఫ్ మెటీరియల్‌తో పి.గన్నవరం మండలానికి వచ్చిన వాహనం

అమలాపురం టౌన్: జిల్లాలో ఎడతెరిపి లేని అధిక వర్షాలతో అవస్థలు పడుతున్న లంక గ్రామాల ప్రజలకు రాష్ట్ర రెడ్ క్రాస్ సొసైటీ తన వంతు సాయంగా ఆహార ప్యాకెట్లు, పునరావాసానికి సంబంధించిన పలు వస్తువులు, తాత్కాలిక గూడు కోసం టార్పాలిన్లు సమకూర్చింది. రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ సూచనల మేరకు రాష్ట్ర రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ ఎ.శ్రీధర్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఏకే పరిదా ఆధ్వర్యంలో ఈ ఏర్పాట్లు జరిగాయి. రెడ్ క్రాస్‌కు చెందిన సహాయ వస్తువులతో వాహనం పి.గన్నవరం మండలంలోని పలు లంక గ్రామాలకు బుధవారం వచ్చింది. రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంక్స్ రాష్ట్ర కో ఆర్డినేటర్ బీవీఎస్ కుమార్‌తో కూడిన బృందం వరద బాధితులను కలిసి వారికి ఆహార ప్యాకెట్లు, వస్తువులను అందజేసింది. ఈ బృందం కలెక్టర్‌ను కలిసి రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా అందించే సహాయ కార్యక్రమాలపై చర్చించింది. రిలీఫ్ మెటీరియల్‌తో వాహనం విజయవాడ నుంచి పి.గన్నవరం మండలానికి చేరుకుంది.

నేడు, రేపు నవోదయ క్లస్టర్స్ స్పోర్ట్స్ మీట్

పెద్దాపురం: స్థానిక జవహర్ నవోదయ విద్యాలయలో గురు, శుక్రవారాల్లో క్లస్టర్ స్థాయి స్పోర్ట్స్ మీట్ నిర్వహించనున్నట్లు విద్యాలయ ప్రిన్సిపాల్ కె.రామిరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేస్తూ 9 జిల్లాల నవోదయ కేంద్రాల నుంచి క్రీడాకారులు ఈ మీట్‌లో తలపడతారన్నారు. క్లస్టర్ లెవల్ బాల్ గేమ్స్ (వాలీబాల్, హ్యాండ్‌బాల్, బాస్కెట్ బాల్) క్రీడలకు నవోదయ తూర్పుగోదావరి 1, 2తో పాటు విశాఖపట్టణం, విజయనగరం, శ్రీకాకుళం, కృష్ణా, పశ్చిమ గోదావరి, గుంటూరు, యానాం నవోదయ కేంద్రాల నుంచి సుమారు 250 మంది క్రీడాకారులు పోటీపడతారన్నారు. బుధవారం ఆయా కేంద్రాల నుంచి వచ్చిన క్రీడాకారులకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేశామని గురువారం ఉదయం 8 గంటలకు స్పోర్ట్స్ మీట్ ప్రారంభించనున్నట్లు విద్యాలయ ప్రిన్సిపాల్ రామిరెడ్డి తెలిపారు.

గౌతమిపై మరో.. మణిహారం



కోటిపల్లి-ముక్తేశ్వరం మధ్య గౌతమి గోదావరిపై ప్రమాదకరంగా పంటు ప్రయాణం

- రోడ్డు వంతెనకు కసరత్తు
- కోటిపల్లి-ముక్తేశ్వరం మధ్య వారధి
- ఉమ్మడి 'తూర్పు' మధ్య అనుసంధానం
- తగ్గనున్న దూరాభారం
- రూ.750 కోట్లతో ప్రతిపాదనలు
- కేంద్రానికి లేఖ రాసిన సీఎం జగన్

కలిసొచ్చే దూరం.. కాలం

కాకినాడ నుంచి అమలాపురానికి యానాం, ఎదుర్లంక, ముమ్మిడివరం మీదుగా వెళ్లాలి. బస్సు, వ్యక్తిగత వాహనాల్లో 65 కిలోమీటర్లు రెండు గంటలపాటు ప్రయాణించాలి. అదే కాకినాడ-రామచంద్రాపురం రోడ్డులో పెనుగుదురు నుంచి గొర్రిపూడి, గొల్లపాలెం, ద్రాక్షారామ, కె.గంగవరం గ్రామాల మీదుగా కోటిపల్లి 30 కిలోమీటర్లు. కోటిపల్లి రేవు నుంచి అమలాపురం నల్లవంతెనకు 10 కిలోమీటర్లు దూరం. ఈ వంతెన సాకారమైతే 25 కిలోమీటర్ల దూరం, గంట ప్రయాణం కలిసి వస్తుంది. ఈ వంతెనతో కాకినాడ, కోనసీమ జిల్లా పరిధిలోని గోదావరికి ఇవతల ఉండే రామచంద్రపురం, మండపేటతో పాటు తూర్పుగోదావరి జిల్లాలోని రాజానగరం, అనపర్తి, రాజమమహేంద్రవరం రూరల్ నియోజకవర్గాల్లోని గ్రామాలకు కోనసీమ మధ్య 40 కిలోమీటర్ల దూరం తగ్గుతుంది. వీటి పరిధిలో 300 గ్రామాల ప్రజలకు ప్రయోజనం కలుగుతుంది.

సాక్షిప్రతినిధి,కాకినాడ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజల మధ్య దూరాభారాన్ని తగ్గించే ఒక బృహత్తర ప్రాజెక్టు మొగ్గ తొడిగింది. కోనసీమ, కాకినాడ జిల్లాల ప్రజల మూడు దశాబ్దాల కల ఇది. కోట్ల విజయభాస్కరరెడ్డి సీఎంగా ఉండగా అప్పటి జిల్లా మంత్రి దివంగత కుడుపూడి ప్రభాకరరావు ప్రయత్నం చేశారు. ఇన్నేళ్ల తరువాత నాటి ప్రతిపాదన మరోసారి తెరపైకి రావడంతో ఉమ్మడి జిల్లాల ప్రజల్లో ఆశలు చిగురించాయి. కోటిపల్లి-ముక్తేశ్వరం మధ్య గౌతమి గోదావరిపై ప్రజలు, వాహన రాకపోకలకు అనువైన వంతెన నిర్మించాలనేది ఏనాటి నుంచో పెండింగ్‌లో ఉన్న ప్రతిపాదన. తాజాగా మన ప్రజాప్రతినిధులు ఈ వంతెన నిర్మాణం కోసం రూ.750 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసి కేంద్ర స్థాయిలో ప్రయత్నిస్తున్నారు.

ఎంపీలు, మంత్రుల సమన్వయ కృషి

తీర ప్రాంతంలో రవాణా సౌకర్యాలు మెరుగుపర్చాలనే కేంద్ర ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ఈ బృహత్తర ప్రాజెక్టు పట్టాలెక్కించాలనే ప్రయత్నం రూపుదాల్చింది. ఇటువంటి భారీ ప్రాజెక్టులకు ఉద్దేశించిన 'కేంద్ర గతిశక్తి పథకం'లో ఈ ప్రాజెక్టు సాకారం చేసుకోవాలనే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. దీనిపై ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి ప్రాతినిథ్యం వహిస్తోన్న ముగ్గురు ఎంపీలు పిల్లి సుభాష్‌చంద్రబోస్, చింతా అనురాధ, వంగా గీత గట్టి పట్టుదలతో ఉన్నారు. ప్రాజెక్టు ఆవశ్యకత, కలిగే ప్రయోజనాలను పలు సందర్భాల్లో మన ఎంపీలు, మంత్రులు పినిపే విశ్వరూప్, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ ఇటీవల వేర్వేరు సందర్భాల్లో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. కోటిపల్లి-నరసాపురం రైల్వే లైన్ నిర్మాణం జరుగుతున్నా అంతకు మించిన ప్రయోజనం ఈ రోడ్డు వంతెన వల్ల కలుగుతుందని వివరించారు. ప్రాజెక్టు ప్రతిపాదనలను పరిశీలించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు. తగిన సహాయ, సహకారాలు అందించాలంటూ కేంద్రప్రభుత్వానికి ఇటీవల సీఎం లేఖ కూడా రాశారు.

నితిన్‌తో భేటీ

ముగ్గురు ఎంపీలు ఇప్పటికే రెండు దఫాలు ఢిల్లీలో కేంద్ర రవాణా శాఖా మంత్రి నితిన్‌గడ్కరీని కలిసి వంతెన ప్రాధాన్యతను వివరించారు. కేంద్ర గతిశక్తి పథకం ద్వారా చేపట్టేందుకు అవకాశం ఉందని కేంద్ర మంత్రి మన ఎంపీలకు వివరించారు. ఈ పథకంలో చోటు కోసం ప్రధానమంత్రి నరేంద్రమోదీ దృష్టికి తీసుకువెళ్లాలని ఎంపీలకు గడ్కరీ సూచించారు. ఈ క్రమంలో ప్రాజెక్టు ప్రతిపాదనలను ప్రధాన మంత్రికి వివరించేందుకు ఆయన అపాయింట్‌మెంట్ కోరినట్లు ఎంపీలు 'సాక్షి'కి తెలియచేశారు.

కోటిపల్లి-ముక్తేశ్వరం మధ్య గౌతమి నది పొడవు 3.5 కిలోమీటర్లు. కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల మధ్య ఉన్న గౌతమి నదిపై ప్రాణాలు అరచేత పట్టుకుని కోటిపల్లి రేవుపై పంటు దాటాల్సిందే. గౌతమి మీదుగా రూ.2,893 కోట్లతో నరసాపురం వరకు రైల్వే లైన్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఇది పూర్తి అయినా నేరుగా రెండు జిల్లాల మధ్య ప్రజలు, వాహనాల రాకపోకలకు అవకాశం దక్కదు. ఈ నేపథ్యంలో గౌతమిపై రోడ్డు వంతెన నిర్మించడానికి జరుగుతోన్న ప్రయత్నాల పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.



కోటిపల్లి-ముక్తేశ్వరం మధ్య ప్రమాదకరంగా గౌతమి గోదావరి

చిరకాల కోరిక తీరినట్టే



కోటిపల్లి నుంచి ముక్తేశ్వరం వరకు రోడ్డు బ్రిడ్జి నిర్మించడం అంటే చిరకాల కోరిక తీరినట్టే. జిల్లాలు విడిపోయాక ప్రస్తుతం జిల్లా కేంద్రం వెళ్లడానికి ప్రమాదకరమైన పంటు ప్రయాణం తప్పడం లేదు. గోదావరికి వరద వస్తే పంటు నిలిచిపోతుంది. అలాంటప్పుడు అమలాపురం వెళ్లడానికి యానాం మీదుగా సుమారు 60 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తుంది. బ్రిడ్జి నిర్మాణం వల్ల 12 కిలోమీటర్లు ప్రయాణిస్తే జిల్లా కేంద్రం చేరుకోవచ్చు.

– ఎ.నారాయణస్వామి,పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు,కోటిపల్లి

వంతెనతో కష్టాలు తొలగుతాయి



పూర్వకాలం నుంచి ముక్తేశ్వరం-కోటిపల్లి వంతెన ప్రతిపాదన ఉంది. చాన్నాళ్ల తర్వాత దీనికి ప్రణాళిక రూపొందించడంతో ఆనందంగా ఉంది. అయినవిల్లి నుంచి కాకినాడ, రామచంద్రపురం వెళ్లాలంటే చుట్టు తిరిగి వెళ్లాల్సి వచ్చేది. గోదావరి చాలా వరకు తిప్పలు వేయడంతో పంటుపై ప్రయాణానికి సమయం ఎక్కువే పడుతుంది. వర్షాకాలంలో పంటు కూడా తిరగని పరిస్థితి. ఈ బ్రిడ్జి నిర్మాణం జరిగితే ప్రయాణభారం తగ్గి ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది.

– ముద్రగడ వీరేశ్వరరావు, మాజీ సర్పంచ్, వీరవల్లిపాలెం, అయినవిల్లి

ఈ ప్రయత్నం చాలా సంతోషం



ఈ వంతెన కోసం నాడు మంత్రి కుడుపూడి ప్రభాకరరావు హయాంలో ప్రయత్నిస్తుంటే చాలా సంతోషపడ్డాం. రాష్ట్ర స్థాయిలో ఆయనతో పాటు జిల్లా నేతలు పెద్ద ప్రయత్నమే చేశారు. రూ.రెండు వందల కోట్లు అవుతుందని లెక్కలేశారు. ఇంత కాలానికి మరోసారి ఈ వంతెన కోసం మన ఎంపీలు, మంత్రులు ప్రయత్నిస్తున్నారని తెలిసింది. నిజంగా వంతెన ఫలిస్తే ఈ ప్రాంత వాసుల చిరకాల కోరిక నెరవేరుతుంది.

– పీకే రావు, సీనియర్ నాయకుడు అంబాజీపేట

వరద ప్రభావిత ప్రాంతాల్లో కలెక్టర్ పర్యటన



మానేపల్లి నుంచి శివాయలంకకు మోటారు సైకిల్‌పై వెళ్తున్న కలెక్టర్ శుక్లా

అయినవిల్లి: మండలంలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో కలెక్టర్ హిమాన్షు శుక్లా బుధవారం పర్యటించారు. ముక్తేశ్వరం -అయినవిల్లిలంక కాజ్‌వే వద్ద వరద పరిస్థితిని సమీక్షించారు. కాజ్‌వే వద్ద వరద ప్రవాహానికి ప్రయాణికులు కొట్టుకుపోకుండా రోప్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. వరద సమయంలో కాజ్‌వే వద్ద ప్రజలు ఇబ్బందులు పడకుండా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడతామన్నారు. అనంతరం వీరవల్లిపాలెం గ్రామంలోని గ్రోయిన్స్‌ను పరిశీలించారు. ఆయన వెంట కొత్తపేట ఆర్డీఓ ఎం.ముక్కంటి ఉన్నారు.

28 వరకూ తీరంలో అప్రమత్తత

అమలాపురం టౌన్: విపత్తుల నిర్వహణ సంస్థ కమిషన్ హెచ్చరికలు, తుపాను హెచ్చరికల కేంద్రం ప్రత్యేక వాతావరణ బులిటెన్ సూచనల మేరకు జిల్లాలోని గోదావరి, సముద్ర తీర ప్రాంత ప్రజలు ఈ నెల 28 వ తేదీ వరకూ అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా సూచించారు. ఈ మూడు రోజుల్లో ఉరుములు, మెరుపులతో కూడిన పిడుగులు పడే అవకాశం ఉందని హెచ్చరించారు. ఈ మేరకు కలెక్టర్ శుక్లా బుధవారం చేసిన అత్యవసర ప్రకటనలో వెల్లడించారు. బలమైన గాలులు వీచే అవకాశం ఉందన్నారు. తీర ప్రాంతాల్లో మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లకూడదని సూచించారు. బంగాళాఖాతంలో సముద్రం అల్లకల్లోలంగా ఉంటుందని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు వర్షాల పరిస్థితిని, తుపాను స్థితిగతులను నిశితంగా పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు మండల ప్రజలకు హెచ్చరికలు జారీ చేయాలని ఆదేశించారు. రహదారులు భవనాల శాఖ పవర్ రంపాలు, జేసీబీలు, ట్రాక్టర్లతో కూలిన చెట్లను, పడిపోయిన విద్యుత్ స్తంభాలను తొలగిస్తూ రోడ్లను క్లీన్ చేసేందుకు సంసిద్ధంగా ఉండాలని సూచించారు. ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు అవసరమైన సామగ్రిని సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ శుక్లా సూచించారు.

400 కుటుంబాలకు ఒక కుకింగ్ పాయింట్

పి.గన్నవరం: వరద ముంపునకు గురయ్యే అవకాశం ఉన్న ప్రాంతాల్లో 400 కుటుంబాలకు కేంద్ర బిందువుగా ఒక కుకింగ్ పాయింట్ సెంటర్ ఏర్పాటు చేసి బాధితులకు ఆహారం, సురక్షిత తాగునీరు, చిన్నారులకు పాలు అందించేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ శుక్లా ఆదేశించారు. పి.గన్నవరం మండలం మానేపల్లి శివారు శివాయలంకలో వరద ముంపు ప్రాంతాల్లో స్థానిక అధికారులతో కలిసి కలెక్టర్ పర్యటించారు. మానేపల్లి నుంచి శివాయలంకకు మోటారు సైకిలుపై వెళ్లి పరిశీలించారు.

ఆరోగ్య రక్షణకు మిషన్ ఇంద్రధనుస్సు

- జిల్లాలో 1.42 లక్షల చిన్నారులకు వ్యాక్సినేషన్ కోసం కార్యాచరణ ప్రణాళిక
- టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశంలో కలెక్టర్ హిమాన్షు శుక్లా



మిషన్ ఇంద్రధనుస్సుపై వైద్యాధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

అమలాపురం టౌన్: అయిదేళ్ల వయసు లోపు చిన్నారుల్లో అనివార్యమయ్యే ప్రాణాంతక వ్యాధుల అదుపునకు మిషన్ ఇంద్రధనుస్సు - 5.0 పూర్తి భరోసాగా నిలుస్తుందని కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. జిల్లాలో మిషన్ ఇంద్రధనుస్సు కార్యక్రమం అమలు విధి విధానాలపై వైద్యాధికారులతో కలెక్టరేట్‌లో బుధవారం జరిగిన జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశంలో కలెక్టర్ శుక్లా మాట్లాడారు. 515 గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా జిల్లాలో ఉన్న 1.42 లక్షల మంది అయిదేళ్ల లోపు చిన్నారుల డేటాను సచివాలయాల వారీగా విభజించి వ్యాక్సినేషన్‌కు కార్యాచరణ రూపొందిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో ఏ చిన్నారి మిస్ కాకుండా ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు యూవీఐఎన్ పోర్టల్లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ సంవత్సరాంతానికి మోజిల్, రూబెల్లా వ్యాధులను పూర్తిగా నిర్మూలించాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ స్పష్టం చేశారు. పోలియో, టెటనస్, కోరింత దగ్గు, క్షయ, హెపటైటిస్-బి, మెనింజైటిస్, న్యుమోనియా తదితర 12 రకాల వ్యాధుల నివారణకు వ్యాక్సినేషన్ల ద్వారా చర్యలు చేపడుతున్నామన్నారు. అక్టోబర్ వరకూ మూడు దశలుగా వ్యాక్సినేషన్ నిర్వహిస్తారన్నారు. తొలి దశలో ఆగష్టు 6 నుంచి 12 వరకూ, రెండో దశలో సెప్టెంబర్ 11 నుంచి 16 వరకూ, మూడో దశలో అక్టోబర్ 9 నుంచి 14 వరకూ వ్యాక్సిన్ వేస్తారని వివరించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ కన్సల్టెంట్ జీసీ హర్షిత్, యూనిసెఫ్ ప్రతినిధి డాక్టర్ శృతి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం. దుర్గారావు దొర, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ శ్రీనివాసరావు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) కోనసీమ శాఖ అధ్యక్షుడు డాక్టర్ వీఎస్ఎస్ఎన్ మూర్తి, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారిణి జీవీ సత్యవాణి పాల్గొన్నారు.

ముగిసిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు



కాంప్లెక్స్ సమావేశంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

రాయవరం: జిల్లాలో మంగళవారం ప్రారంభమైన స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు బుధవారం సాయంత్రంతో ముగిశాయి. ఉపాధ్యాయులందరూ ఒకచోట చేరి వృత్తిలోని అనుభవాలను, అభిప్రాయాలను పంచుకోవడానికి స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను నిర్వహించారు. ప్రాథమిక స్థాయిలో ఉపాధ్యాయులకు ఒకచోట, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 6,7,8 తరగతులకు బోధన చేసే సబ్జెక్టు ఉపాధ్యాయులకు ఒక చోట స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను నిర్వహించారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎం.కమలకుమారి పర్యవేక్షణలో జిల్లాలో ఉన్న 123 స్కూల్ కాంప్లెక్స్‌ల పరిధిలో సమావేశాలను నిర్వహించారు. స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్లు, సెక్రటరీల పర్యవేక్షణలో జరిగిన సమావేశాల్లో రీసోర్స్ పర్సన్లు, విషయ నిపుణత కలిగిన ఉపాధ్యాయులు బోధనాభ్యసన పద్ధతులపై చర్చలు చేశారు. పలు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల్లో మాదిరి పాఠ్య బోధన చేపట్టారు. స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను రాష్ట్ర అధికారులతో పాటుగా డీఈవో, డీవైఈవో, సమగ్ర శిక్షా సెక్టోరియల్ అధికారులు, మండల విద్యాశాఖాధికారులు పర్యవేక్షించారు.

అందుబాటులో ఆహారం

- మార్కెట్ రేటులో 40 శాతానికి మించకుండా ధరలు
- ఉమ్మడి 'తూర్పు'లో 20 'ఆహా' క్యాంటీన్ల ఏర్పాటుకు సన్నాహాలు
- మహిళల స్వయం ఉపాధికి ప్రభుత్వం మరో ముందడుగు
- నగరాలు, పట్టణాల్లో యూనిట్‌కు రూ.13 వేల సాయం చేయనున్న మెప్మా

అమలాపురం టౌన్: నగరాలు, పట్టణాల్లో స్వయం సహాయక సంఘాల (డ్వాక్రా)కు ఉపాధి అవకాశాలను మెరుగు పరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరో ముందడుగు వేస్తోంది. ఇప్పటి వరకూ ఆ సంఘాలకు కుటీర పరిశ్రమలు, వ్యాపారాలతో స్వయం ఉపాధికి మార్గం చూపింది. తాజాగా ఆ సంఘాలు 'ఆహా' పేరిట క్యాంటీన్లు ఏర్పాటు చేసుకుని మరింత ఆదాయ వనరులు పెంచుకునేలా ఏర్పాట్లు చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో ఆహా కాంటీన్ల ఏర్పాటుకు కసరత్తు మొదలు పెట్టింది. ఇందులో భాగంగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని రెండు మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో మొత్తం 20 ఆహా క్యాంటీన్లు ఏర్పాటు చేసేందుకు మెప్మా సన్నాహాలు చేస్తోంది. రాజమహేంద్రవరం, కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్లలో నాలుగేసి వంతున, మిగిలిన 12 క్యాంటీన్లు మున్సిపాలిటీల్లో ఏర్పాటు చేయనుంది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని అమలాపురం, రామచంద్రపురం, మండపేట మున్సిపాలిటీలు, ముమ్మిడివరం నగర పంచాయతీలో ఒక్కొక్కటి వంతున ఆహా క్యాంటీన్లు మంజూరయ్యాయి. అమలాపురం మున్సిపాలిటీలో ఆర్టీసీ బస్‌స్టేషన్ లేదా ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి వద్ద క్యాంటీన్ నెలకొల్పే అవకాశాలపై ఇక్కడి మెప్మా సిటీ మిషన్ పరిశీలిస్తోంది.

రుచి, శుచితో ప్యాక్డ్ ఫుడ్ అందించే ఏర్పాట్లు

ఆహా క్యాంటీన్ల ద్వారా రుచి, శుచికరమైన ఆహారాన్ని ప్యాక్ పద్ధతిలో డ్వాక్రా మహిళల ద్వారా విక్రయించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. క్యాంటీన్ పెట్టే సంఘానికి రూ.13 వేల సాయం ప్రభుత్వం మెప్మా ద్వారా అందిస్తుంది. ఈ నిధులతోనే సంబంధిత సంఘం క్యాంటీన్‌ను ఏర్పాటు చేస్తుంది. మొబైల్ పద్ధతిలో అన్ని వసతులతో డిజైన్ చేసిన టెంట్ మాదిరి కియోస్క్‌లను సిద్ధం చేసింది. ఇప్పటికే వైఎస్సార్ చేయూత, ఆసరా పథకాలతో ఆర్థిక సాయం పొందిన సంఘాలు మెప్మా ఇస్తున్న రూ.13 వేలతో క్యాంటీన్‌ను నిర్వహించనున్నాయి. ఇప్పటికే సంఘాల ద్వారా టిఫిన్ సెంటర్లు, హోటళ్లు నిర్వహిస్తున్న అనుభవాన్ని ప్రాతిపదికగా తీసుకుని వారికి క్యాంటీన్ల బాధ్యతల అప్పగించనున్నారు. జన సంచారం ఎక్కువగా ఉండే బస్టాండ్లు, ఆస్పత్రులు, ప్రధాన కూడళ్లలో వీటిని ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. క్యాంటీన్ల ఏర్పాటుకు మెప్మా పర్యవేక్షణలో పనిచేసే టౌన్ లెవెల్ ఫెడరేషన్లు (టీఎల్ఎఫ్) బాధ్యత తీసుకున్నాయి. ఆయా ప్రాంతాల జన సంచారం, డిమాండ్‌లను బట్టి క్యాంటీన్ల ద్వారా ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనాలు విక్రయించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. భోజనం రూ.40కే విక్రయించేలా కసరత్తు జరుగుతోంది. మార్కెట్ రేటులో 40 శాతానికి మాత్రమే భోజనం అందించాలన్నది ప్రభుత్వ ఆలోచన. ఆహారాన్ని ఇంటి వద్దే వండి ఎంపిక చేసిన ప్రాంతాల్లో ఏర్పాటు చేసే కియోస్క్‌ల్లో విక్రయిస్తారు.



ఆహా క్యాంటీన్ నిర్వహించే కియోస్క్

ఏర్పాటు చేసే ప్రాంతాల ఎంపిక త్వరలో



ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని నగరాలు, పట్టణాల్లో 20 ఆహా క్యాంటీన్లను సిద్ధం చేస్తున్నాం. ఇప్పటికే కార్పొరేషన్లు, మున్సిపాలిటీల పరిధుల్లో ఉత్సాహంగా ఉన్న స్వయం సహాయక సంఘాలు ముందుకు వచ్చాయి. ప్రభుత్వం మెప్మా ద్వారా ఇచ్చే రూ.13 వేల సాయం అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. త్వరలోనే క్యాంటీన్లను ఆయా నగరాలు, పట్టణాల్లో ఏర్పాటు చేసే ప్రాంతాల ఎంపిక పూర్తి చేస్తాం.

– బి.ప్రియంవద, ప్రాజెక్ట్ డైరెక్టర్, మెప్మా, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా

క్లుప్తంగా

విద్యుదాఘాతానికి మత్స్యకారుడి మృతి


లక్ష్మణరావు మృతదేహం

అల్లవరం: తెగిపడిన త్రీ ఫేజ్ విద్యుత్ వైరు.. చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుడి కాళ్లకి తగిలి మృతి చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. అల్లవరం మండలం మొగళ్లమూరు పంచాయతీ పరిధిలోని లక్ష్మణేశ్వరం గ్రామానికి చెందిన సంగాడి లక్ష్మణరావు (69) మురుగుకాల్వలోకి చేపల వేటకు వెళ్లాడు. ఏటిగట్టుపై నడుస్తుండగా అక్కడ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి తెగిపడి ఉన్న త్రీ ఫేజ్ వైరు అతని కాళ్లకి తగిలి షాక్ గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటుగా వెళ్తున్న మత్స్యకారుడు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. బుధవారం ఉదయం 9 గంటల సమయంలో విద్యుత్ వైరు తెగిపడినా, మధ్యాహ్నం వరకు స్థానిక లైన్‌మెన్ గ్రామంలో విధులు నిర్వర్తించినా గుర్తించకపోవడం వల్లే ఈ దుర్ఘటన జరిగిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యంతోనే నిండు ప్రాణం బలైందని కుటుంబీకులు కన్నీరు మున్నీరుగా విలపించారు. అల్లవరం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలను సేకరించారు. మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

ప్రియురాలికి పెళ్లి కుదిరిందని ఆత్మహత్య


జీజీహెచ్‌లో దేవాశీష్ మృతదేహం

కాకినాడ క్రైం: ప్రియురాలికి పెళ్లి కుదిరిందని మనస్తాపానికి గురైన ఓ వివాహితుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాకినాడ టూ టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రేచర్లపేట చినవీధికి చెందిన మోర్తా దేవాశీష్ (25)కు కొన్నేళ్ల క్రితం ప్రవీణ అనే యువతితో వివాహమైంది. వీరిద్దరూ స్థానిక సచివాలయం పరిధిలో వలంటీర్లుగా పనిచేసేవారు. వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేసి ఇంటికే పరిమితం అయ్యారు. ఈ నేపథ్యంలో దేవాశీష్‌కు వెంకట్‌నగర్‌లో వలంటీరుగా పనిచేస్తున్న మరో యువతితో పరిచయం అయింది. ఆ పరిచయం ప్రేమకు దారి తీసింది. అయితే యువతికి వివాహం నిశ్చయం కావడంతో మనోవేదనకు గురైన దేవాశీష్ బుధవారం ఇంట్లో ఫ్యానుకు చీరతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గమనించి కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా పరీక్షించిన వైద్యులు మార్గమధ్యంలోనే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి సోదరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బంగారు భవితకే విలీనం

- ప్రశస్థ యాప్‌తో చిన్నారుల్లో లోపాల గుర్తింపు
- పాఠశాలల్లో సర్వే చేస్తున్న ఉపాధ్యాయులు
- యాప్ ఇన్‌స్టాలేషన్ 90 శాతం పూర్తి


ప్రశస్థ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్న ఉపాధ్యాయులు

రాయవరం: ప్రత్యేక అవసరాలు గల చిన్నారులు మిగిలిన విద్యార్థులతో కలిసి చదివేలా భవిత కేంద్రాలను సమీప పాఠశాలల్లో విలీనం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రత్యేక అవసరాలు గల (శారీరక, మానసిక దివ్యాంగులు) పిల్లలను సాధారణ విద్యార్థులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం భవిత కేంద్రాలను ఏర్పాటు చేసింది. వీటి ద్వారా ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ, బ్రెయిలీ నైపుణ్యాలు పెంపొందించడం, తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇవ్వడం, క్రమశిక్షణ వంటి సేవలందిస్తున్నారు. తద్వారా వారిలో ఆత్మన్యూనతా భావం పోవడంతో పాటు, సహచర విద్యార్థులతో సమాన అవకాశాలను అందిపుచ్చుకునే వీలుంటుంది. అందులో భాగంగా ప్రస్తుతం జాతీయ విద్యా పరిశోధన శిక్షణ సంస్థ(ఎన్‌సీఈఆర్‌టీ) రూపొందించిన ప్రీ అసెస్‌మెంట్ హోలిస్టిక్ స్క్రీనింగ్ టూల్ (ప్రశస్థ) యాప్ ద్వారా జిల్లాలోని పాఠశాలలో ప్రతి విద్యార్థిని స్క్రీనింగ్ చేస్తున్నారు. జిల్లాలో యాప్ ఇన్‌స్టాలేషన్ 90 శాతం పూర్తి చేశారు.

ఉపాధ్యాయుల సెల్‌లో ప్రశస్థ యాప్ ఇన్‌స్టాలేషన్ ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉన్న ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లోని ప్రధానోపాధ్యాయుడితో సహా ప్రతి ఉపాధ్యాయుడు వారి వ్యక్తిగత సెల్‌ఫోన్‌లో ప్రశస్థ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. యాప్ సహాయంతో పాఠశాలల్లోని ప్రతి విద్యార్థిని స్క్రీనింగ్ చేస్తారు. ఈ స్క్రీనింగ్ ద్వారా ప్రత్యేక అవసరాలు గల చిన్నారుల్లోని లోపాలను గుర్తిస్తారు. యాప్‌లో ప్రతి చిన్న వైకల్యాన్ని గుర్తించేందుకు వీలుగా 63 అంశాలతో ప్రశ్నావళి ఉంటుంది. పిల్లల నుంచి సమాధానాలు రాబట్టి యాప్‌లో పొందుపరిస్తే వారిలోని అభ్యసన సామర్థ్యాలు, ఏ అంశాల్లో వెనుకబడి ఉన్నారో గుర్తించి అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటారు. అవసరమైన వారికి ఉపకరణాలు కూడా అందజేసి, రెమిడియల్ తరగతులు నిర్వహిస్తారు. మొదటి దశలో ఉపాధ్యాయులు, రెండవ దశలో ఐఈఆర్‌టీలు, ఉన్నత పాఠశాలల్లో ప్రత్యేక బోధకులు విద్యార్థుల సామర్థ్యాన్ని తెలుసుకుంటారు. అనంతరం దివ్యాంగ చిన్నారుల అభ్యసన సామర్థ్యాల ఆధారంగా బోధన చేస్తారు.

ప్రత్యేక సదుపాయాలు

ఇప్పటి వరకు భవిత కేంద్రాల ద్వారా ఐదు నుంచి 14 ఏళ్ల వయసు కలిగిన మానసిక, శారీరక దివ్యాంగుల పిల్లలకు 21 రకాల రుగ్మతలకు సంబంధించి వైద్య సేవలు అందజేసేవారు. కేంద్రాలకు రాలేని వారి ఇళ్లకు ఐఈఆర్‌టీలు వెళ్లి గృహ ఆధారిత విద్య(హోమ్ బేస్డ్ ఎడ్యుకేషన్)సేవలు అందిస్తున్నారు. శారీరక లోపాలతో బాధపడుతున్న దివ్యాంగ చిన్నారులకు ఫిజియోథెరపీ సేవలను, మాటలు రాని వారికి స్పీచ్ థెరపీ అందిస్తున్నారు. ఇప్పుడు భవిత కేంద్రాలను పాఠశాలల్లో విలీనం చేసిన తర్వాత పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తున్నారు. వీరికి ఉదయం నుంచి సాయంత్రం వరకు బోధన చేయడంతో పాటుగా, మధ్యాహ్న భోజనాన్ని, రెగ్యులర్ విద్యార్థులకు ప్రభుత్వం అందించే అన్ని సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నారు. దివ్యాంగులకు అవసరమైన కృత్రిమ పరికరాలు, మూడు చక్రాల సైకిళ్లు, చంక కర్రలు, వినికిడి యంత్రాలు, సీపీ చైర్స్ తదితర ఉపకరణాలను ఉచితంగా అందజేస్తున్నారు. ప్రతీ రోజు యోగా, వ్యాయామం, వారానికి ఒకసారి ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీతో పాటు ప్రతి విద్యార్థికి రవాణా భత్యంగా నెలకు రూ.300 చెల్లిస్తున్నారు.

ప్రశస్థ యాప్ లోగో

ఎందుకు విలీనం చేశారంటే..

భవిత కేంద్రాలకు వచ్చే చిన్నారుల హాజరు, వారి వివరాలు సమీపంలోని పాఠశాలల్లో నమోదు చేయాలి. దివ్యాంగ చిన్నారులు భవిత కేంద్రానికి వస్తున్నారో..లేదో పాఠశాల సిబ్బందికి తెలియని పరిస్థితి నెలకొంటోంది. సమీపంలోని పాఠశాల నుంచి దివ్యాంగ చిన్నారులకు భోజనం, గుడ్లు, చిక్కీ తదితరాలు అందజేయాలి. సరైన పర్యవేక్షణ కొరవడడంతో ఇవన్నీ జరుగుతున్నాయో..లేదో తెలియడం లేదు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని జిల్లాలోని అన్ని భవిత కేంద్రాలను సమీపంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విలీనం చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు జిల్లాలో ఉన్న 22 భవిత కేంద్రాలను సమీప పాఠశాలల్లో విలీనం చేయాల్సి ఉండగా, ఇప్పటికే 21 పాఠశాలలను విలీనం చేశారు. జిల్లాలో ఉన్న 22 భవిత కేంద్రాల్లో ఇప్పటికే 2,586 మంది విభిన్న ప్రతిభావంతులు ఉన్నారు.

పక్కాగా పర్యవేక్షణ



పాఠశాలల్లో భవిత కేంద్రాలను విలీనం చేయడం వల్ల పర్యవేక్షణ మరింత పక్కాగా ఉంటుంది. దివ్యాంగ చిన్నారులు సహచర విద్యార్థులతో కలసి సమాన అవకాశాలను అందిపుచ్చుకునే ప్రయత్నం చేస్తారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వారి భవిష్యత్తుకు దోహదపడుతుంది.

– మల్రెడ్డి వీరవెంకట సత్యనారాయణ, ఇంక్లుజివ్ ఎడ్యుకేషన్ జిల్లా కోఆర్డినేటర్, అమలాపురం

యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి



జిల్లాలోని ప్రతీ ఉపాధ్యాయుడు మొబైల్‌లో ప్రశస్థ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. పాఠశాలల్లో ఉన్న చిన్నారులందరినీ యాప్ సహాయంతో స్క్రీనింగ్ చేసి, లోపాలు ఉన్న చిన్నారులను గుర్తించాలి. స్క్రీనింగ్ ప్రక్రియను వేగవంతం చేసి, జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలి.

– ఎం.కమలకుమారి, జిల్లా విద్యాశాఖాధికారి, అమలాపురం

గృహహింస కేసులో రెండేళ్ల జైలు

గోకవరం: గృహహింస కేసులో భర్తకు రెండేళ్ల జైలు శిక్ష పడినట్లు గోకవరం ఎస్సై యూవీ శివనాగబాబు తెలిపారు. గోకవరంలో స్థానిక డ్రైవర్స్ కాలనీకి చెందిన అన్నిక రాజ్యలక్ష్మి తన భర్త సత్తినాటి శివరామకృష్ణ తనను వేధింపులకు గురి చేస్తున్నాడంటూ 2018వ సంవత్సరంలో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై అప్పటి డీఎస్పీ హుస్సేన్ ఎస్సీ, ఎస్టీ కేసు, గృహహింస కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. విచారణ అనంతరం శివరామకృష్ణపై నేరం రుజువు కావడంతో రాజమహేంద్రవరం ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జి ఎం.నాగేశ్వరరావు ముద్దాయికి రెండేళ్ల జైలుశిక్ష, రూ.వేయి జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు వెల్లడించారు. ఈ కేసులో పీపీ జి.వెంకటరత్నం ప్రాసిక్యూషన్ తరఫున వాదనలు వినిపించగా నార్త్ జోన్ డీఎస్పీ కడలి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో కోర్టు హెడ్ కానిస్టేబుల్ త్రిమూర్తులు, కానిస్టేబుల్ నజీర్ సుభానీ సకాలంలో సాక్షులను ప్రవేశపెట్టారు. హెడ్‌కానిస్టేబుల్, కానిస్టేబుళ్లను డీఎస్పీ వెంకటేశ్వరరావు, సీఐ ఉమామహేశ్వరరావు, ఎస్సైలు అభినందించారు.

సీపీఆర్ నిర్వహణపై వర్క్‌షాప్

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్‌లోని స్కిల్ ల్యాబ్‌లో బుధవారం కార్డియో పల్మనరీ రీ సక్సియేషన్(సీపీఆర్)పై కార్యశాల జరిగింది. ఏపీజే అబ్దుల్ కలాం జాతీయ సీపీఆర్ వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఇండియన్ రిసక్సియేషన్ కౌన్సిల్ ఫెడరేషన్ (ఐఆర్‌సీఎఫ్) చైర్మన్ డాక్టర్ చక్రరావును జీజీహెచ్ అనస్థీషియా విభాగం వైద్యులు సత్కరించారు. అనస్థీషియా హెచ్‌వోడీ డాక్టర్ విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో జరిగిన వర్క్‌షాప్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జలజ ప్రవీణ బీఎల్ఎస్, క్వాలిటీ సీపీఆర్ నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చక్రరావు మాట్లాడుతూ, ప్రతి వ్యక్తి ప్రాణ రక్షకుడేనన్నారు. వైద్యులతో పాటు సామాన్యులు సైతం నేర్చుకోదగ్గ ఓ సునాయాస ప్రక్రియ సీపీఆర్ అని తెలిపారు. సీపీఆర్ నిర్వహించే తీరుపైనా నిర్వాహకులకు శిక్షణనిచ్చారు. రంగరాయ వైద్య కళాశాల అనస్థీషియా పీజీలు, టెక్నీషియన్ల కోసం నిర్వహించిన ఈ వర్క్‌షాప్‌లో అనస్థీషియా ప్రొఫెసర్ డాక్టర్ ప్రసన్నకుమార్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పర్వీణ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అరుణ, కన్సల్టెంట్ అనస్థీషియాలజిస్టు డాక్టర్ అనిల్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు చరిష్మ సాయి


అంబాజీపేటలో చరిష్మను అభినందిస్తున్న హెచ్‌ఎం సాయిరాం, ఉపాధ్యాయులు

అంబాజీపేట: రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాస్కెట్ పోటీలకు స్థానిక జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని నిమ్మకాయల చరిష్మ సాయి రుత్వి ఎంపికైనట్లు హెచ్‌ఎం కడలి సాయిరాం తెలిపారు. అంబాజీపేట హైస్కూల్‌లో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన చరిష్మను బుధవారం పలువురు అభినందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం సాయిరాం మాట్లాడుతూ ఈ నెల 21 నుంచి 23 వరకు రామచంద్రపురం జెడ్పీ హైస్కూల్‌లో జరిగిన అంతర్ జిల్లా సబ్ జూనియర్ బాస్కెట్‌బాల్ పోటీలలో చరిష్మ సాయి రుత్వి అత్యంత ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. వచ్చే నెల 3 పాండిచ్చేరిలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించనుందన్నారు. జాతీయ స్థాయిలో అత్యంత ప్రతిభ కనబర్చి రాష్ట్రానికి పేరు తీసుకురావాలని పలువురు ఆకాంక్షించారు. తర్ఫీదునిచ్చిన పీడీ కుంపట్ల ఆదిలక్ష్మిని పలువురు అభినందించారు. చరిష్మను పీఎంసీ చైర్మన్ అరిగెల రామతులసి, బాస్కెట్ బాల్ స్టేట్ సెలెక్షన్ కమిటీ చైర్మన్ ఎన్.అప్పలరాజు, బీఎఫ్ఐ కార్యదర్శి జి.చక్రవర్తి, ఆశ్వా కమిటీ చైర్మన్ అరిగెల మధు, ఉపాధ్యాయులు బొక్కా వెంకటేశ్వరరావు, వెన్నపు సత్యనారాయణ అభినందించారు.

చోరీలు చేసి.. ఓఎల్‌ఎక్స్‌లో అమ్మేసి..

- ముగ్గురిని అరెస్టు చేసిన సర్పవరం పోలీసులు
- రూ.14లక్షల విలువైన సొత్తు స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న అడిషనల్ ఎస్పీ శ్రీనివాస్. చిత్రంలో డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి, సీఐ మురళీకృష్ణ

కాకినాడ రూరల్: సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశ వారిని దొంగతనాల వైపు మళ్లించింది. ఏసీలు రిపేరు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునే వారు అడ్డదారులు వెదికారు. తాళాలు వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలకు పాల్పడ్డారు. ఇళ్లలోని విలువైన వస్తువులు, మంచాలు, టీవీలు, కంప్యూటర్లతో పాటు గోడలకు బిగించి ఉన్న ఏసీలను వదలేదు. వీటితో పాటు కార్లను దొంగిలించారు. ఇలా చోరీ చేసిన వస్తువులను ఓఎల్‌ఎక్స్ యాప్‌లో విక్రయించి సొమ్ములు చేసుకున్నారు. మూడు పోలీసు స్టేషన్ల పరిధిలో ఒకేలా ఉన్న చోరీ కేసులుపై ఫిర్యాదులు రావడంతో నిఘా ఉంచిన పోలీసులకు చివరకు చిక్కారు. సర్పవరం పోలీసులు స్టేషన్‌లో అడిషనల్ ఎస్పీ పి.శ్రీనివాస్ బుధవారం మీడియాకు వివరాలు వెల్లడించారు. కాకినాడ రూరల్ రాయుడుపాలెం శ్రీరామనగర్‌కు చెందిన నార్ని సతీష్ చంద్ర, వాకలపూడి శ్రీనివాసనగర్‌కు చెందిన బుడగ ఆనంద్‌కుమార్, రాయుడుపాలెం సిద్ధార్థనగర్‌కు చెందిన కర్రి నాగ శివకుమార్‌లను అరెస్టు చేసి వారి నుంచి రూ.14లక్షల విలువైన చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నామన్నారు. స్వాధీనం చేసుకున్న వాటిలో రెండు కార్లు, 8 ఏసీలు, ఒక ల్యాప్‌ట్యాప్, ఒక జిరాక్స్ మెషీన్, ఒక ప్లేయింగ్ కీ బోర్డు, ఒక సామ్‌శ్యాంగ్ వాషింగ్ మెషీన్, కంప్యూటర్ సిస్టమ్, రెండు టేకు మంచాలు, నాలుగు ఇన్వర్టర్ బ్యాటరీలు, ఒక ప్రింటర్, రెండు ఎల్‌ఈడీ టీవీలు ఉన్నాయి. నిందితులపై సర్పవరం స్టేషన్‌లో ఐదు కేసులతో పాటు తిమ్మాపురం, పిఠాపురం టౌన్ స్టేషన్‌లో ఒక్కోటి చొప్పున మొత్తం ఏడు కేసులు నమోదయ్యాయన్నారు. సతీష్ చంద్రపై గతంలో బైక్ చోరీ కేసు ఉందన్నారు. నిందితులను స్పెషల్ మొబైల్ కోర్టులో హాజరు పరుస్తామన్నారు. కేసును ఛేదించడంతో సర్పవరం సీఐ ఆకుల మురళీకృష్ణ, క్రైమ్ సిబ్బంది హెచ్‌సీలు జి. సత్యనారాయణ, గణేష్, పీసీ వెంకటరత్నం, సతీష్‌కుమార్‌ను ఎస్పీ సతీష్‌కుమార్ అభినందించారని, త్వరలో రివార్డును ఎస్పీ చేతులు మీదుగా స్వీకరిస్తారన్నారు. కేసు ఛేదన చోరీ అయిన కారు ద్వారా సాధ్యమయ్యిందని డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి, సీఐ మురళీకృష్ణ తెలిపారు.

అరటి ఎగుమతుల్లో కార్పొరేట్ స్టైల్


రావులపాలెం యార్డులో ట్రేలలో అత్తాలను ప్యాక్ చేస్తున్న కూలీలు

రావులపాలెం: అరటి ఎగుమతులకు పెట్టింది పేరు రావులపాలెం అరటి మార్కెట్ యార్డు. నిన్న మొన్నటి వరకు రైతులు యార్డుకు తీసుకువచ్చిన అరటి గెలలను వ్యాపారులు కొనుగోలు చేసి అరటి ఆకులను పైన చుట్టి లారీల్లో ఎగుమతి చేసేవారు. ఇప్పుడు ఇక్కడ అరటి అత్తాలను ప్లాస్టిక్ ట్రేలలో ప్యాక్ చేసి ఎగుమతి చేస్తున్నారు.

హైదరాబాద్‌కు చెందిన ఓ మార్ట్‌కు బుధవారం రావులపాలెం అరటి మార్కెట్ యార్డ్ నుంచి ఈ విధంగా ట్రేలలో అరటి ఎగుమతులు జరిగాయి. స్థానిక వ్యాపారి కోణాల చంద్రశేఖర్‌రెడ్డి 700 కర్పూర రకం అరటి గెలలను కొనుగోలు చేసి మార్ట్ ప్రతినిధులకు అప్పగించినట్టు తెలిపారు. ఒక్కో ట్రేలో 8 నుంచి 9 అత్తాలు పట్టాయన్నారు. 700 గెలలను ఈ విధంగా ప్యాక్ చేస్తే 600 బాక్స్‌లు అయ్యాయన్నారు. ఒక్కో గెలకు సుమారు రూ.200 నుంచి రూ.250 చెల్లించి కొనుగోలు చేసినట్లు వివరించారు.

షేర్ మార్కెట్‌లో నష్టం రావడంతో ఆత్మహత్య


గంగాధర్ మృతదేహం

కాకినాడ క్రైం: షేర్ మార్కెట్‌లో నష్టాలు రావడంతో ఓ వ్యక్తి అప్పుల పాలై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాకినాడ టూ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పెదపూడి మండలం కరకుదురు గ్రామానికి చెందిన బిక్కిన గంగాధర్ చౌదరి(28)కి నాలుగేళ్ల క్రితం రోజారాణితో వివాహం అయింది. ఈ దంపతులకు పిల్లలు లేరు. పెట్రో కెమికల్ ఇంజినీరింగ్ చేసిన గంగాధర్ ఇరాక్‌లో ఉద్యోగం చేసి స్వదేశానికి వచ్చాడు. గంగాధర్ షేర్ మార్కెట్‌లో చురుకుగా పెట్టుబడులు పెట్టేవాడు. ఈ క్రమంలో రూ.30 లక్షల మొత్తం పోగొట్టుకున్నాడు. నష్టాల కారణంగా అప్పుల పాలయ్యాడు. ఆవేదన తాళలేక బ్యాంకుకు వెళుతున్నానని చెప్పి మంగళవారం ఇంటి నుంచి బయల్దేరి కాకినాడ వచ్చాడు. మెయిన్‌రోడ్డులోని చందన బ్రదర్స్ ఎదురుగా ఉన్న జీపీ రెసిడెన్సీలో గది అద్దెకు తీసుకున్నాడు. పురుగు మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అయితే రోజంతా ఇంటికి రాకపోయే సరికి కుటుంబ సభ్యులు మంగళవారం సాయంత్రం నుంచి వెదకడం మొదలు పెట్టారు. బుధవారం మధ్యాహ్నానికి గంగాధర్ వాహనాన్ని జీపీ రెసిడెన్సీ బయట గమనించారు. హోటల్ యాజమాన్యం వద్ద తమ అనుమానాన్ని వెల్లడించారు. కుటుంబీకుల విన్నపంతో హోటల్ బృందం గంగాధర్ అద్దెకు తీసుకున్న గది తలుపులు తెరిచి చూడగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు నిర్ధారించారు. ఈ ఘటనపై కాకినాడ టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

యానాం మద్యం సీసాలకు ఏపీ లేబుల్స్

ముగ్గురి అరెస్టు


స్వాధీనం చేసుకున్న పరికరాలతో అడిషనల్ ఎస్పీ ఖాదర్ బాషా, సీఐ శ్రీనివాస్

కొత్తపేట: యానాం నుంచి మద్యం సీసాలు తీసుకువచ్చి వాటిపై నకిలీ ఏపీ మద్యం లేబుల్స్ అతికించి అమ్ముతూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న ముగ్గురిని అరెస్టు చేసినట్టు అడిషనల్ ఎస్పీ ఖాదర్‌బాషా తెలిపారు. ఎస్పీ ఎస్.శ్రీధర్ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ ఖాదర్‌బాషా ఆధ్వర్యంలో దాడులు జరిపి అరెస్టులు, నమోదు చేసిన కేసుకు సంబంధించి వివరాలు బుధవారం రాత్రి విలేకరులకు తెలిపారు. స్థానిక ఎస్‌ఈబీ స్టేషన్ పరిధిలో గతంలో పెనుగొండ మండలం చిన మల్లం గ్రామానికి చెందిన గూడాల చంద్రశేఖర్ స్వామికి చెందిన ఒక స్విఫ్ట్ కార్‌ను, 500 మద్యం సీసాలతో పట్టుకున్నారు. ఈ కేసు విచారణలో గూడాల చంద్రశేఖర్‌స్వామిని బుధవారం అరెస్టు చేసి, అతనికి నకిలీ లేబుల్స్ అందజేస్తున్న పశ్చిమగోదావరి జిల్లా అచంటకు చెందిన పీతల భగత్‌సింగ్‌ను, వాటిని ప్రింట్ చేస్తున్న అదే గ్రామానికి చెందిన రుద్ర డిజిటల్ యజమాని పాలనాటి సాయిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 270 నకిలీ లేబుల్స్, కంప్యూటర్, స్కానర్, కలర్ ప్రింటర్‌ను స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసును ఛేదించిన స్థానిక ఎస్‌ఈబీ సీఐ మద్దాల శ్రీనివాస్‌ను, డీటీఎఫ్ సీఐ కే వీరబాబును, సిబ్బందిని అడిషనల్ ఎస్పీ ఖాదర్ బాషా అభినందించారు.

పప్పు, ఫ్లోర్ మిల్లుల్లో విజిలెన్స్ తనిఖీలు

రూ.3.15 లక్షల పప్పు ధాన్యాల సీజ్


గంటి ఫ్లోర్ మిల్లులో తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

కొత్తపేట: మండల పరిధిలోని గంటి గ్రామంలో ఒక దాల్ అండ్ ఫ్లోర్ మిల్లులో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం తనిఖీలు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా నిల్వ ఉన్న రూ.3.15 లక్షల విలువ చేసే పప్పు ధాన్యాలను సీజ్ చేసినట్టు అధికారులు తెలిపారు. ఇన్‌చార్జ్ రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కె.కుమార్ ఆధ్వర్యంలో విజిలెన్స్, సివిల్ సప్లయిస్, లీగల్ మెట్రాలజీ అధికారులు కొత్తపేట, పి.గన్నవరం మండలాల్లోని వివిధ హోల్‌సేల్ అండ్ రిటైల్ షాపుల్లో తనిఖీలు జరిపారు. దానిలో భాగంగా గంటి రాఘవేంద్ర దాల్ అండ్ ఫ్లోర్ మిల్లులో తనిఖీలు నిర్వహించారు. పప్పుధాన్యాల నిల్వలకు సంబంధించి స్టాకు రిజిస్టర్, బిల్లు బుక్స్ నిర్వహించకపోవడం, స్టాకు వివరాలు ప్రభుత్వ వెబ్‌సైట్‌లో నమోదు చేయకపోవడం, ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్ లేకపోవడం వంటి కారణాలతో షాపు యజమానిపై 6 – ఏ కేసు నమోదు చేసి, రూ.3.15 లక్షలు విలువ చేసే 31.50 క్వింటాళ్ల పప్పు ధాన్యాలు సీజ్ చేశారు. కార్యాలయ ఇన్‌స్పెక్టర్ సత్యకిషోర్, వ్యవసాయ అధికారి జె.భార్గవమహేష్, కానిస్టేబుళ్లు వలీ, లోవరాజు, ఎంఎస్‌ఓ టీవీఎస్ రమాదేవి పాల్గొన్నారు.

నేడు నిధి ఆప్ కే నిఖత్

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రవరం ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ (ఈపీఎఫ్‌వో) ప్రాంతీయ కార్యాలయం పరిధిలో గురువారం నిధి ఆప్‌కే నిఖత్–డిస్ట్రిక్ట్ ఔట్‌రీచ్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు అసిస్టెంట్ పీఎఫ్ కమిషనర్ వైడీ శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాకు చెందిన పింఛన్‌దారులు పలివెలరోడ్డులోని ఈతకోటలోని ఎస్ఏసీఎల్ ఇండస్ట్రీస్ లిమిటెడ్‌లోను, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు చెందిన పింఛన్‌దారులు అమలాపురం మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న విద్యానిధి జూనియర్ కళాశాలలోను, అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన పింఛన్‌దారులు రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ రిసోర్స్‌సెంటర్‌లోను, కాకినాడ జిల్లా పింఛన్‌దారులు కాకినాడ – సామర్లకోట బైపాస్ రోడ్డులోని ఆదానీ విల్మార్ సంస్థలోను, ఏలూరు జిల్లా పింఛన్‌దారులు తణుకులోని ది ఆంధ్రా సుగర్స్ లిమిటెడ్‌లోను, పశ్చిమగోదావరిజిల్లా పింఛన్‌దారులు వేండ్రలోని డెల్టా పేపర్‌మిల్లులో నిర్వహించే కార్యక్రమానికి హాజరు కావాలన్నారు. వివిధ రకాల పింఛన్లు, పింఛను ప్రయోజనాలకు అర్హత, ఈ-నామినేషన్, పీపీవో, డీఎల్‌సీ ఇతర సేవలు నిర్వహిస్తారన్నారు. సభ్యులు, పింఛనుదారులు, ఎస్టాబ్లిష్మెంట్‌లు, కొత్తగా కవర్ చేసిన ఎస్టాబ్లిష్మెంట్‌లు ఈ అవుట్ రీచ్ ప్రోగామ్‌ను ఉపయోగించుకోవాలన్నారు. పింఛనుదారులు, డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ సమర్పించడానికి ఈ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఇద్దరు దొంగల అరెస్టు

పి.గన్నవరం: స్థానిక అక్విడెక్టు సమీపంలో ఆలయాలు, కూరగాయల షాపులో చోరీలకు పాల్పడ్డ ఇద్దరు అన్నదమ్ములను పి.గన్నవరం ఎస్సై హరికోటి శాస్త్రి బుధవారం అరెస్టు చేశారు. ఈనెల 22వ తేదీ అర్ధరాత్రి పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయం వద్ద డిబ్బీని పగులగొట్టి అందులోని రూ.5 వేలను, పక్కనే ఉన్న కూరగాయల షాపులోకి చొరబడి రూ.1,500లను దోచుకున్నారు. 24వతేదీ అర్ధరాత్రి షిర్డీ సాయిబాబా వారి ఆలయం తలుపులు బద్దలు గొట్టేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. దీంతో ఆలయ కమిటీల చైర్మన్లు, కూరగాయల షాపు యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీ టీవీ కెమెరాల్లో లభించిన ఆధారాలతో ఇద్దరు దొంగలను గుర్తించారు. యర్రంశెట్టివారిపాలేనికి చెందిన యర్రంశెట్టి రాజు, దుర్గాప్రసాద్ ఇద్దరూ అన్నదమ్ములు. వీరి జీవనోపాధి నిమిత్తం కొన్నేళ్ల క్రితం హైదరాబాద్‌లోని జీడిమెట్లకు వెళ్లారు. కోనసీమలో జరిగిన సుమారు 10 చిల్లర దొంగతనం కేసుల్లో రాజు నిందితుడుగా ఉన్నాడు. ఈ క్రమంలో ఈ నెల 19న అమలాపురం కోర్టు వాయిదాకు హాజరయ్యేందుకు తమ్ముడు దుర్గాప్రసాద్‌తో కలిసి జీడిమెట్ల నుంచి ఇక్కడికి వచ్చాడు. కోర్టుకు హాజరై తిరిగి జీడిమెట్లకు వెళ్లకుండా పి.గన్నవరంలో చోరీలకు పాల్పడ్డాడు. తాను దొంగతనాలు చేస్తున్నప్పుడు బయట తమ్ముడిని కాపలాగా ఉంచాడు. ఇద్దరినీ అరెస్టు చేసి, కొత్తపేట కోర్టులో హాజరు పరుస్తున్నట్టు ఎస్సై హరికోటి శాస్త్రి వివరించారు.